క్లుప్తంగా

డ్రైన్ల నిర్మాణానికి శ్రీకారం



నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ దృష్టికి ప్రజలు తీసుకువచ్చిన సమస్యల పరిష్కారంలో భాగంగా నిర్మించనున్న డ్రైన్ల నిర్మాణాలకు సోమవారం ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రీకారం చుట్టారు. నాలుగు ప్రాంతాల్లో నిర్మించనున్న డ్రైన్లకు కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైఎస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వార్డు సభ్యులు సాక్షి పద్మనాభం, కాలుకురచ ఏడుకొండలు, యండమూరి ఈశ్వరరావు, వెంకటరమణ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు పంచామృతాభిషేకాలు

మండపేట: పట్టణంలోని బురగుంట చెరువు వద్ద శ్రీసీతారామక్షేత్రంలో వేంచేసి ఉన్న సీతారామచంద్ర స్వామి వారికి సోమవారం పంచామృతాభిషేకాలు ఘనంగా జరిగాయి. అర్చకులు మరింగంటి వరదాచార్యులు పర్యవేక్షణలో ఆలయ కమిటీ చైర్మన్ మల్లిపూడి గణేశ్వరరావు దంపతులు, మల్లిపూడి వెంకటేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఆలయంలో కల్యాణ మండపం ఏర్పాటుకు బహిరంగ వేలం



ద్రాక్షారామ పైడా అన్నసత్రంలో వేలంపాట నిర్వహిస్తున్న ఈఓ తారకేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని రమా సత్యవతీ సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో తాత్కాలిక కల్యాణ మండపం ఏర్పాటు చేసుకోవాడానికి పైడా వారి అన్నసత్రంలో సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి(తారకేశ్వరరావు) ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలం పాటను రూ.2,06,500 చల్లా బుజ్జి దక్కించుకున్నారు. గత ఏడది కంటే రూ.95,450 అదనంగా ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు. మండపం ఈ ఏడాది మే ఒకటి నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వ తేదీ వరకూ ఉంటుందని తెలిపారు.

రేపటి నుంచి దివ్యాంగులకు బస్‌పాస్‌లు

రాయవరం: మండలంలోని 12 గ్రామ పంచాయతీల పరిధిలోని 19 సచివాలయాల్లో ఉన్న దివ్యాంగులకు బుధవారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకూ దివ్యాంగులకు రాయితీపై ఆర్టీసీ బస్‌పాస్‌లు జారీ చేయనున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో డి.శ్రీనివాసు సోమవారం విలేకరులకు తెలిపారు. రామచంద్రపురం ఆర్టీసీ డిపోకు చెందిన అధికారులు రాయితీపై బస్‌పాస్‌లు జారీ చేస్తున్నట్టు తెలిపారు. అర్హులైన వారు సదరం మెడికల్ సర్టిఫికెట్ జెరాక్స్-1(పెద్ద సర్టిఫికెట్+చిన్న సర్టిఫికెట్), ఆధార్ జెరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు. మూడేళ్ల కాల పరిమితికి రూ.100లతో బస్‌పాస్ ఇవ్వనున్నట్టు తెలిపారు. సదరం యూనిక్ కార్డు ఉన్న వారికి కూడా బస్‌పాస్ ఇవ్వనున్నారన్నారు. ఈ నెల మూడున రాయవరం-1, 4న రాయవరం-2, 5న సోమేశ్వరం-1, సోమేశ్వరం-2, లొల్ల, 6న చెల్లూరు-1, చెల్లూరు-2, 8న వెంటూరు-1, వెంటూరు-2 బస్‌పాస్‌లు ఇస్తారన్నారు. 9న కూర్మాపురం, కురకాళ్లపల్లి, 10న వెదురుపాక, 11న మాచవరం-1, మాచవరం-2, 12న పసలపూడి-1, పసలపూడి-2, చెల్లూరు-3, 15న నదురుబాద, వి.సావరం సచివాలయాల పరిధిలో బస్‌పాస్‌లు జారీ చేస్తారన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఆయా సచివాలయాల వద్ద బస్‌పాస్‌లు ఇస్తారని తెలిపారు.

విద్యార్థులకు పోటీలు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలోని సత్యసాయి నిలయంలో సత్యసాయిబాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా బాలవికాస్ కార్యక్రమాలు, విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. మండలంలోని విద్యార్థులతోపాటు యానం, కె.గంగవరం మండలంలోని 12 గ్రామాల నుంచి బాలవికాస్ విద్యార్థులు చిత్రలేఖనం, పాటల పోటీలు, వ్యాస రచన, శ్లోకాలు, కథలు తదితర అంశాలలో పోటీ పడ్డారు. ఉదయం నగర సంకీర్తన, పతాక ఆవిష్కరణ, భజన, అష్టోత్తర పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు కన్వీనర్ విస్సాప్రగడ కృష్ణమూర్తి, దంగేరు జోన్ కన్వీనర్ రావిపాటి నారాయణరావు, సబ్ జోన్ కన్వీనర్ నున్న నర్సింహమూర్తి, దేవరపల్లి సత్యానారాయణ, ప్రముఖ గాయకులు అక్కిరాజు శ్రీనివాసు, బాల వికాస్ గురువులు, సాయి భక్తులు పాల్గొన్నారు.

చివరిలో ఆశలపై నీళ్లు

- తెరిపివ్వని వర్షం
- ఆందోళనలో అన్నదాతలు
- గ్రామాల్లో నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు



బందనపూడిలో ధాన్యం రాసులను ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

మండపేట: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులను కలవరపెడుతున్నాయి. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని తడవకుండా కాపాడుకునేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రైతులకు అండగా పంట నష్టం పరిశీలించేందుకు అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటిస్తోంది.

డివిజన్‌లోని మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో 92,862 ఎకరాల్లో రైతులు రబీ సాగు చేశారు. అధిక శాతం విస్తీర్ణంలో ఎంటీయూ 1121, ఎంటీయూ 3626 రకాలను సాగు చేయగా కొద్ది విస్తీర్ణంలో ఆర్ఎల్ఆర్ 15048, తొలకరి పంటకు విత్తనాల కోసం స్వర్ణ రకం వంగడాలను సాగు చేశారు. జిల్లాలోని మిగిలిన ప్రాంతాల కన్నా నియోజకవర్గంలో ముందుగానే రైతులు రబీ సాగు చేయడంతో పంట తుది దశకు చేరుకోగా మాసూళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 60 శాతం విస్తీర్ణంలో కోతలు పూర్తి కాగా ఎక్కడికక్కడ రైతులు పొలాలు, కళ్లాల్లో ధాన్యం ఆరబెట్టుకునే పనిలో ఉన్నారు. ప్రస్తుత దశలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో గత మూడు రోజులుగా నెలకొన్న వాతావరణ పరిస్థితులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

అకాల వర్షం కురవడంతో...

అప్పటి వరకు ఎండకాసి అంతలోనే ఆకాశం మేఘావృతమై వర్షం కురుస్తుండడం రైతులను ఉరుకులు పరుగులు పెట్టిస్తోంది. సోమవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు మండపేట, రామచంద్రపురం, కపిలేశ్వరపురం తదితర ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పలుచోట్ల వరిపంట నేలకొరిగింది. ఆరబెట్టుకునే వీలులేక పోవడంతో రైతులు ధాన్యాన్ని బరకాలు కప్పి ఉంచారు. పల్లపు ప్రాంతాల్లో ధాన్యం రాశుల చుట్టూ చేరిన నీటిని బాటలు చేసి తొలగించుకుంటున్నారు. మరో పది రోజులు వాతావరణం అనుకూలిస్తే దాళ్వా పనులు చాలా వరకు పూర్తవుతాయని రైతులు అంటున్నారు.



కె.గంగవరంలో ధాన్యం తడవకుండా బరకాలు కప్పుతున్న రైతులు



మండపేటలో ధాన్యం రాశులు తడవకుండా బరకాలు కప్పి ఉంచిన దృశ్యం

గ్రామాల్లో పర్యటిస్తున్న అధికారులు

పంట నష్టం పరిశీలనకు రెవెన్యూ, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరికలు నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

గుండెల్లో గుబులు..

కె.గంగవరం: ధాన్యాగారమైన రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో 6308 హెక్టార్లు, రామచంద్రపరం మండలంలో 6వేల హెక్టార్లు, కాజులూరు మండలంలో 7200 హెక్టార్లలో ఈ ఏడాది రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట నియోజవకర్గంలోని మూడు మండలాల్లో కోత దశలో ఉంది. సుమారుగా 30 శాతం పంటను కోసి ధాన్యాన్ని రోడ్లపై, పొలం గట్లపై రైతులు ఆరబెట్టుకున్నారు. మరికొంత మంది పనలను కోసి చేలోని వదిలేశారు. ఇలాంటి పరిస్థితిల్లో సోమవారం తెల్లవారు జాము నుంచి కురిసిన వర్షానికి రైతులు ఆందోళన చెందుతున్నారు.

మాసూళ్ల సమయంలో కలవరం

కాజులూరు: మండలంలో సోమవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షానికి గ్రామాల్లో పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు, నేలకొరిగాయి. వైర్లు తెగిపడ్డాయి. దీంతో పల్లెలకు విద్యుత్ సరఫరా నిలిచిపోగా, రాకపోకలు స్తంభించాయి. ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ స్తంభాలను, వైర్లను సరి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ప్రస్తుతం వరికోతలు, మాసూళ్లు జరుగుతుండడంతో రైతులు కాజులూరు మండలంలో సుమారు 30 శాతం కోతలు జరిగాయి. ఇప్పటికైనా వర్షాలు తగ్గి పంట సుక్షితంగా ఒడ్డుకు చేరాలని రైతులు కోరుకుంటున్నారు.



వెదురుపాకలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో సింధుసుబ్రహ్మణ్యం



అముజూరులో పడిపోయిన పనలను చూపిస్తున్న రైతు

రాయవరం: అకాల వర్షాలు రైతులకు నష్టాన్ని మిగులుస్తున్నాయి. ధాన్యం ఎక్కడికక్కడ తడిసిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలో 26.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలంలో 40 శాతం వరికోతలు పూర్తయ్యాయి. ఇదిలా ఉంటే రామచంద్రపురం ఆర్డీవో సింధుసుబ్రహ్మణ్యం, మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు డాక్టర్ శివశంకరప్రసాద్, మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ మండలంలోని 12 గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో సింధూసుబ్రహ్మణ్యం పలు గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబు, ఎంపీడీవో డి.శ్రీనివాస్, ఎంఏవో ప్రభాకర్ క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులు అధైర్య పడకుండా సూచనలు చేశారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

మండపేట: ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు మండపేట ఎస్‌వీఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ. శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకూ జరిగే ప్రత్యేక తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సోమవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు.

వర్షంలోనూ పింఛన్ల పంపిణీ



రాయవరంలో వర్షంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు

రాయవరం: వర్షం కురుస్తున్నా వలంటీర్లు పింఛన్ల పంపిణీ చేపట్టారు. సోమవారం వేకువజాము నుంచే లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందించారు. రామచంద్రపురం, మండపేట క్లస్టర్ పరిధిలోని రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం మండలాలతో పాటు, రామచంద్రపురం, మండపేట పట్టణాల్లో 62,904 మందికి మే నెల పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. వివిధ రకాల పింఛన్ల కింద రూ.17,12,17,750 పంపిణీ చేయాల్సి ఉంది. అయితే సోమవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి 41,226 మందికి రూ.11,15,29,000 పంపిణీ చేపట్టారు. క్లస్టర్ పరిధిలో 66శాతం పింఛన్ల పంపిణీ చేపట్టారు. మిగిలిన వారికి మంగళ, బుధ వారాల్లో పంపిణీ చేపట్టనున్నారు. రాయవరం మండలం 83.91శాతం పింఛన్ల పంపిణీ చేసి క్లస్టర్ పరిధిలో మొదటి స్థానంలో నిలిచింది.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

రైతులకు మంత్రి వేణు భరోసా

కె.గంగవరం: అధైర్య పడొద్దు ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ రైతులకు భరోసా ఇచ్చారు. మండల పరిధిలోని కుందూరులో సోమవారం అకాల వర్షాలకు నీట మునిగిన పంట పొలాలు, తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో అకాల వర్షం కారణంగా జరిగిన నష్టం గురించి వ్యవసాయ శాఖ మంత్రితో మాట్లాడుతానని, సీఎం జగన్‌మోహన్ రెడ్డి రైతులందరినీ ఆదుకుంటారన్నారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిశాయని తద్వారా పంట నష్టం వాటిల్లిందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని, నష్టాన్ని అంచనా వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారన్నారు. రామచంద్రపురం మండలంలో ఉండూరు, వెల్ల గ్రామాల్లో కూడా మంత్రి పర్యటించారు. రామచంద్రపురం ఆర్డీఓ సింధూ, ఎంపీపీ పంపన నాగమణి, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, ఎంపీడీఓ ఎన్.శ్రీనివాసరావు, తహసీల్దార్ వైద్యనాథ్ శర్మ, ఏఓ సత్యప్రసాద్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.



కుందూరులో తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

కాజులూరు: వర్షాలు కురుస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని కరప డివిజన్ ఏడీఏ కె.బాబూరావు అన్నారు. సోమవారం ఆయన ఏఓ వి.అశోక్‌తో కలిసి మండలంలో పర్యటించారు. రైతులకు పలు సూచనలు చేశారు. కోలంకలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మరో రెండు రోజులు విస్తారంగా వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని, వర్షాలు తగ్గేవరకూ వరి కోతలను వాయిదా వేసుకోవాలన్నారు. వీఏఏలు పి.ప్రసాద్, నరేష్, సూర్య, నాగేంద్ర పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: అకాల వర్షానికి చేతికందిన పంట తడిసిన నేపథ్యంలో వ్యవసాయ సంబంధిత అధికారులు, సిబ్బంది తగిన చర్యలు ప్రారంభించారని, రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు రైతులకు భరోసా ఇచ్చారు. వెదురుమూడిలో తడిసిన ధాన్యపు రాశులను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ ధాన్యం పరిస్థితిని వివరించారు. మండలంలో 1,031 ఎకరాల్లోని 3,600 మెట్రిక్ టన్నుల ధాన్యం రాశులుగా ఉందని ఏఓ తెలిపారు. వర్షాలు తగ్గి పంట మాసూలు చేసుకునే వరకూ వ్యవసాయ అనుబంధ ఉద్యోగులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని ఎమ్మెల్సీ తోట ఆదేశించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ గుణ్ణం భాను ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు చోడే వెంకటేశ్వరరావు, నక్కా సింహాచలం, పాలింగి శ్రీను, యర్రా వీరన్నబాబు, పసలపూడి శ్రీనివాస్, అద్దాల శ్రీనివాస్, వీఆర్వో సత్యనారాయణ ఉన్నారు.



వెదురుమూడిలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

21 కిలోల గంజాయి పట్టివేత

రాయవరం: లొల్ల గ్రామం సమీపంలో గంజాయి ముఠాపై మండపేట రూరల్ సీఐ శివగణేష్, రాయవరం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ దాడి చేశారు. ఈ దాడిలో నిందితుల వద్ద నుంచి 21.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. లొల్ల గ్రామం సమీపంలోని చింతలరోడ్డు ఎదురుగా మురుగు కాలువ గట్టుపై సీతంపేట శ్మశానం వద్ద కొందరు వ్యక్తులు గంజాయి గురించి మాట్లాడుకుంటున్నట్టుగా సమాచారం వచ్చింది. ఈ సమాచారం ఆధారంగా మండపేట రూరల్ సీఐ శివగణేష్, డిప్యూటీ తహసీల్దారు కె.విజయరేఖలతో కలిసి ఘటన స్థలానికి వెళ్లారు. అక్కడ అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం సోకులగూడెంకు చెందిన కాలెపు విజయకుమార్ అనే వ్యక్తి 21.5 కిలోల గంజాయిని అమ్మకం చేసేందుకు తీసుకుని వచ్చాడు. మండపేట మండలం ద్వారపూడికి చెందిన చింతలపూడి చక్రధర్, కాకి పవన్‌దుర్గరాజు, మండపేట పట్టణంలోని న్యూకాలనీకి చెందిన గంటా దుర్గాప్రసాద్, జెర్రీ రామచంద్రశ్యామ్, రథం సెంటర్‌కు చెందదిన మేక శివశ్యామ్‌ప్రసాద్‌లకు గంజాయిని అమ్ముతుండగా స్వాధీనం చేసుకుని, నిందితులను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై తెలిపారు. గంజాయి అమ్మకాలపై కేసు నమోదు చేశామని, మండపేట రూరల్ సీఐ శివగణేష్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పట్టుకున్న గంజాయి, నిందితులతో మండపేట రూరల్ సీఐ శివగణేష్, ఎస్సై సురేష్, డీటీ విజయరేఖ

కల్యాణోత్సవ పూజలు ప్రారంభం

కపిలేశ్వరపురం: స్థానిక దుర్గామాత సమేత పార్వతీ పాపవినాసేశ్వర స్వామి, పార్వతీమాత సమేత అగస్త్యేశ్వర స్వామివార్ల దివ్య కల్యాణ మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ తాటికొండ కనకరాజు ఆధ్వర్యంలో సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో యలమంచిలి కృష్ణమూర్తి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, ధ్వజారోహణ పూజలు చేశారు. దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈనెల 6 వరకూ కల్యాణోత్సవాల పూజలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

బీసీ సంఘం నూతన కమిటీ ఎన్నిక



మండపేట బీసీ సంఘం నాయకులు

మండపేట: మండపేట బీసీ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం స్థానిక శెట్టిబలిజ కమ్యూనిటీ హాలులో జరిగింది. జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి సంఘ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కోన సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘ అధ్యక్షుడిగా మేడెంటి సూర్యప్రకాశరావు, ప్రధాన కార్యదర్శిగా ఒంపోలు పోలరాజు, ట్రెజరర్‌గా టేకి నారాయణరావు, ఉపాధ్యక్షుడిగా మల్లువలస గణపతిరావు, గౌరవ అధ్యక్షుడిగా గోరు అన్నవరం, గౌరవ సలహాదారుడిగా శీలామంతుల సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా విన్నకోట రాధాకృష్ణప్రసాద్, గౌరవ అధ్యక్షుడిగా కుక్కల రామారావు, రూరల్ ఉపాధ్యక్షునిగా పసలపూడి శ్రీను, జిల్లా గౌరవాధ్యక్షులుగా పెంకే గంగాధరరావు, మట్టపర్తి గోవిందరాజు, కింతాడ హేమశ్రీనువాస్, కావిడి హరికృష్ణ, వనపర్తి వెంకటేశ్వరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ నూతన కమిటీని అభినందించి, బీసీల ఐక్యతకు, సంక్షేమానికి పనిచేయాలని కోరారు.

సోమేశ్వరుడు పెళ్లికొడుకాయెనె..

రాయవరం: మండలంలోని చారిత్రక శివాలయాలైన సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, వెంటూరులోని ఉమా సమేత సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవాల్లో భాగంగా సోమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం స్వామివారిని, అమ్మవారిని పెండ్లికొడుకు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించారు. పెళ్లిపనులు ప్రారంభానికి సూచనగా ముత్తైదువులు పసుపును దంచారు. ఆలయ అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్య శర్మ, పండుల అర్చకత్వంలో వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని కల్యాణ పూజలు నిర్వహించారు. ఈ నెల 4న సాయంత్రం ఐదు గంటల సమయంలో స్వామివారు, దేవేరిలకు రథోత్సవం, 5న పూర్ణాహుతి, త్రిశూలస్నానం, 6న దేవేర్లకు పుష్పోత్సవం నిర్వహించనున్నారు. వెంటూరు శివాలయంలో కూడా భక్తుల శివనామస్మరణ నడుమ శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. రాయవరంలో వేంచేసియున్న పార్వతి సమేత రాజేశ్వర స్వామి వారి కల్యాణాన్ని ఆలయ ప్రధాన అర్చకులు విలపర్తి ఫణిధర్‌శర్మ, శశిధర్‌శర్మ ఘనంగా నిర్వహించారు.



ప్రత్యేకలంకరణలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి

వైభవంగా సత్యనారాయణస్వామి కల్యాణం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న రమా సత్యవతీ సమేత సత్యనారాయణస్వామి దివ్య కల్యాణం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. వేద మంత్రోచ్చారణల మధ్య స్వామి కల్యాణాన్ని భక్తులు తిలకించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు, వరలక్ష్మి దంపతులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ద్రాక్షారామలో రమా సత్యవతీ సమేత సత్యనారాయణస్వామి కల్యాణ వేడుకలో మంత్రి వేణు

ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం

మండపేట: కార్మిక సమస్యలపై ఐక్య పోరాటాలతోనే హక్కులను సాధించగలమని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 137వ మేడే వేడుకలు సోమవారం మండపేట పట్టణ, మండలంలో ఘనంగా నిర్వహించారు. కార్మిక జెండాలను ఎగురవేశారు. సీఐటీయూ, మండపేట మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి మే డే జెండాను ఎగురవేశారు. కార్మిక సంఘాల నాయకులు అనిల్‌కుమార్, తోట వెంకటరామయ్య, ఎస్‌కే ఇబ్రహిం, మేడిశెట్టి బేబీ, కుమారి, బంగారు కొండ, కొమరపు నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ద్వారపూడిలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

కాజులూరు: మండలంలో కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. గొల్లపాలెంలో వీరవెంకటేశ్వర లేబర్ కాంట్రాక్ట్ సొసైటీలో సంఘ కార్యదర్శి పెంకే సత్యనారాయణ ఆధ్వర్యంలోనూ, కాజులూరులో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు యాళ్ల సత్తిబాబు ఆధ్వర్యంలోనూ, చాకిరేవుమెరకలో జిల్లా టెలీకం సలహామండలి సభ్యుడు విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో కార్మికులు ఎర్ర జెండాను ఆవిష్కరించారు.



మండపేటలో మేడే వేడుకల్లో కృష్ణవేణి తదితరులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ, అన్నాయిపేట సెంటర్‌లో భీమేశ్వర గూడ్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్, భారత కార్మిక సంఘాల సమైఖ్య, ఐఎఫ్‌టీయూ అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. యూనియన్ ప్రెసిడెంట్ పాలిక సత్తిబాబు ఎర్ర జెండాను ఎగురవేశారు. అనంతరం సీపీఐఎంఎల్(న్యూ డెమోక్రసీ) జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ అమర వీరుల రక్త తర్పణలతో సాధించుకున్న హక్కులను ప్రపంచీకరణ పేరుతో దేశాన్ని పాలిస్తున్న బీజేపీ కాలరాస్తుందని మండిపడ్డారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ద్రాక్షారామ గ్రామ పంచాయతీ వద్ద మేడే వేడుకలు నిర్వహించారు.

రామచంద్రపురం: పట్టణంలోని గ్యాస్ గొడౌన్ వద్ద ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. గ్యాస్ కార్మికుల సంఘం అధ్యక్షుడు గణేష్ ఎర్ర జెండా ఎగురవేశారు. ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు గెద్దాడ సూరిబాబు, పీడీఎస్‌యూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధూ, ఐఎఫ్‌టీయూ రామచంద్రపురం డివిజన్ కార్యదర్శి ఎం. రాజు తదితరులు మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మిక నాయకుడు భూషణం, ఎంపీడీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ నాయకురాలు మేడిశెట్టి దుర్గమ్మ, స్టీల్‌వెల్‌పేట వద్ద సహకార సంఘాల యూనియన్ రాష్ట్ర కోశాధికారి పెంకే సత్యనారాయణలు మేడే జెండాలను ఎగుర వేశారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

రాయవరం: మండలంలోని పసలపూడిలో సోమవారం సంఘటిత, అసంఘటితరంగ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సీఐటీయూ మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మి పాల్గొని మాట్లాడారు. సీపీఎం పార్టీ నేత కొవ్వూరి సత్యనారాయణరెడ్డి సీఐటీయు జెండాను ఆవిష్కరించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, కపిలేశ్వరపురంలలో సోమవారం మేడే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కపిలేశ్వరపురం బస్ స్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన వేడుకల్లో సీపీఐ నాయకులు ప్రసంగించారు. అంగరలోని తోరాటి లక్ష్మణమూర్తి స్మారక స్థూపం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో అమరవీరులకు నివాళులర్పించారు. యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు పి.సురేంద్ర, మండల అధ్యక్ష, కార్యదర్శులు జువ్వల శ్రీనివాస్, ఇల్లూరి సూరిబాబు,భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పాల్గొని కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు.



అంగరలో కార్మికుల హక్కులపై మాట్లాడుతున్న సురేంద్ర

సబ్ పోస్టాఫీస్‌గా పెదపూడి బ్రాంచి

పెదపూడి: కాకినాడ జిల్లాలోని పెదపూడి బ్రాంచ్ పోస్టాఫీస్‌ను సబ్ పోస్టాఫీస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. సోమవారం ఈ తపాలా కార్యాలయాన్ని గ్రామ సర్పంచ్ కె.కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టి.సుభాష్, ఎంపీడీవో విజయభాస్కరరావు, జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ డి.నాగేశ్వరరెడ్డి, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. పెదపూడి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ నూతన తపాలా కార్యాలయంలోని అన్ని సదుపాయాలను వినియోగించుకోవాలన్నారు. కాకినాడ డివిజనల్ సూపరింటెండెంట్ డి.నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూయుఎస్ పోస్టాఫీసులు ఇప్పుడు బ్యాంకులకు ధీటుగా పనిచేస్తుందన్నారు.

స్విమ్మింగ్ శిక్షణ ప్రారంభం

పెదపూడి: వేసవి స్విమ్మింగ్ శిక్షణ తరగుతులను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని జీఆర్ఎస్‌పీ క్లబ్ ముఖ్య సలహాదారుడు మండ రాజారెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలోని జీఆర్‌పీఎస్‌పీ(ఫ్యామిలీ హెల్త్ క్లబ్)లో సోమవారం విద్యార్థులు, చిన్నారులకు వేసవి ఈత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.